జాతీయ వార్తను ఈ-పేపర్‌లోనూ,
డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.జాతీయవార్త.కామ్‌లో
కూడా వీక్షించవచ్చు.

epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com

జాతీయ
# వార్త
తెలుగు దిన పత్రిక

చదవండి.. చదివించండి..
జాతీయ వార్త తెలుగు దినపత్రిక
మా పత్రిక అభివృద్ధికి పాఠకులు, శ్రేయోభిలాషులు, మిత్రులు, అధికారులు సహకరించాలని మనవి. మీమీ మండలాల్లో ఏమైనా సమస్యలు ఉన్నాయా.. ఎవరైనా ఇబ్బందులు పెడుతున్నారా.. అయితే వాటిని మా దృష్టికి తీసుకురండి.. వాటిని జాతీయ వార్త తెలుగు దిన పత్రికలో ప్రచురిస్తాం. మీ సమస్యలను రాజకీయ నాయకులు, అధికారుల దృష్టికి తీసుకువెళతాం - ఎడిటర్, ఫోన్: 9963063761
epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com

గురువారం | 18-6-2026 | శ్రీకాకుళం | సంపుటి: 3 సంచిక: 704 పేజీలు: 4 వెల: రూ.7

✳ నిప్పుల కుంపటిలా మారిన కొత్తూరు తమ్ముళ్ల రాజకీయం ✳ వర్గ పోరు లేదన్న 'ఎంజీఆర్' ✳ చెంపదెబ్బలాంటి షాక్ ఇచ్చిన నియోజకవర్గ నేతలు ✳ వైస్ ఎంపీపీ ఆధ్వర్యంలో 'ఎస్ఐఆర్' శిక్షణ ✳ మండల కమిటీ, క్లస్టర్ ఇంచార్జ్‌ల బహిష్కరణ! ✳ గ్రూపు తగాదాలతో ఇలాగే కొట్టుకుంటే స్థానిక ఎన్నికల్లో 'సింక్' అవ్వడం ఖాయం!





# ఏమయ్యా తమ్ముళ్లు..
# ఏంటీ.. ఈ లొల్లి!

**కొత్తూరు, జూన్ 17 (వార్త):** పాతపట్నం నియోజకవర్గంలోని కొత్తూరు మండల తెలుగుదేశం పార్టీలో అంతర్గత కుమ్ములాటలు ఒక్కసారిగా బట్టబయలయ్యాయి. నిన్న మొన్నటి వరకు "మనమంతా ఒకటే.. మన మధ్య గ్రూపుల్లేవు" అంటూ నేతలందరూ పైకి మేకపోతు గాంభీర్యం ప్రదర్శించినా, లోపల ఉన్న నిప్పుల కుంపటి ఒక్కసారిగా బద్దలైంది. ఇటీవల కొత్తూరు వ్యవసాయ శాఖ కార్యాలయ ఆవరణలో పాతపట్నం ఎమ్మెల్యే మామిడి గోవిందరావు ప్రెస్ మీట్ పెట్టి.. కొత్తూరు మండల తమ్ముళ్లలో ఎలాంటి విభేదాలు లేవని, అంతా సవ్యంగానే ఉందని సర్దిచెప్పే ప్రయత్నం చేశారు. కానీ, ఆ మాటలు చెప్పిన సిరా ఆరకముందే.. తమ్ముళ్లు ఎమ్మెల్యే మాటలను పెడచెవిన పెట్టి చెంపదెబ్బ లాంటి షాక్ ఇవ్వడం ఇప్పుడు నియోజకవర్గంలో పెను సంచలనంగా మారింది.

**ఎమ్మెల్యే పీఏ వచ్చినా.. 'దుమ్మా' కొట్టిన లీడర్లు..!**

విశ్వసనీయ సమాచారం ప్రకారం.. ఎమ్మెల్యే మామిడి గోవిందరావు స్వయంగా ఇచ్చిన ఆదేశాలు, సూచనల మేరకు కొత్తూరు టీడీపీ సీనియర్ లీడర్, స్థానిక వైస్ ఎంపీపీ లోతుగెడ్డ తులసీ వరప్రసాద్ రావు ఆధ్వర్యంలో ఈనెల 13వ తేదీన స్థానిక రామాలయంలో అత్యంత ప్రతిష్టాత్మకమైన ఓటర్ల జాబితా సవరణపై టీడీపీ మండల స్థాయి శిక్షణ తరగతులు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి స్వయంగా ఎమ్మెల్యే క్యాంపు ఆఫీస్ నుండి ఆయన పీఏ సోమేశ్ ఈ ట్రైనింగ్ ఇవ్వడానికి ప్రత్యేకంగా విచ్చేశారు. కట్ చేస్తే.. సీన్ లో అసలైన ట్విస్ట్ ఊహించని విధంగా జరిగింది! ఈ అధికారిక శిక్షణ కార్యక్రమానికి కొత్తూరు మండల టీడీపీ ప్రెసిడెంట్ అగతముడి మాధవరావు గానీ, ఆయన ఆధ్వర్యంలోని పూర్తి మండల కమిటీ గానీ ముఖం చాటేశారు. అంతటితో ఆగకుండా మండలంలోని కీలకమైన కొత్తూరు, మెట్టూరు, నివగాం క్లస్టర్ల ఇంచార్జ్‌లు పొత్రఖండ మోహనరావు, నెల్లి అచ్యుతరావులతో పాటు జిల్లా తెదేపా ఆర్గనైజింగ్ సెక్రటరీ అరుణ్ కుమార్ సైతం ఈ మీటింగ్‌కు రాకుండా





'హ్యాండ్' ఇవ్వడం పార్టీ వర్గాల్లో తీవ్ర కలకలం రేపుతోంది.

**పత్రికల మీద పడి ఏడ్చారుగా.. ఇప్పుడేం చెప్తారు..?**

స్వయంగా ఎమ్మెల్యే పంపిన ప్రతినిధి శిక్షణ ఇస్తుంటే.. తులసీ వరప్రసాద్ వ్యతిరేక వర్గంగా ముద్రపడిన మండల కమిటీ, క్లస్టర్ ఇంచార్జ్‌లు గ్రూపు కట్టి మరీ గైర్హాజరు కావడం ఓపెన్ పొలిటికల్ వార్‌కి తెరలేపింది. ఇది ఎమ్మెల్యే ఎంజీఆర్ ఆదేశాలను ధిక్కరించడం కాదా? అని రాజకీయ విశ్లేషకులు ప్రశ్నిస్తున్నారు. మరోవైపు సొంత పార్టీ తమ్ముళ్లే మండల కమిటీ తీరుపై నిప్పులు చెరుగుతున్నారు. "మా మధ్య ఏ గొడవలూ లేవు.. అంతా పత్రికల వారే లేనిపోనివి రాసి రాద్ధాంతం చేస్తున్నారంటూ" గతంలో గగ్గోలు పెట్టి, ప్రెస్ వాళ్లపై పడి ఏడ్చిన సదరు నాయకులు.. ఇప్పుడు పార్టీ అఫీషియల్ ప్రోగ్రామ్‌ను ఎందుకు బహిష్కరించారో సమాధానం చెప్పాలని నిలదీస్తున్నారు. ఈ బహిష్కరణతో మండలంలో గ్రూపు రాజకీయాలు పీక్స్‌కి చేరాయనేది పచ్చి నిజమని క్యాడర్ బాహాటంగానే చర్చించుకుంటోంది. పైకి గంభీరంగా నటిస్తూ.. లోపల ఒకరి కాళ్లు ఒకరు లాక్కునే ఇలాంటి 'కోవర్టు' రాజకీయాలు ఇకనైనా ఆపకపోతే





రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో టీడీపీ ఘోర పరాజయాన్ని చవిచూడక తప్పదని రాజకీయ విశ్లేషకులు స్ట్రాంగ్ వార్నింగ్ ఇస్తున్నారు. ఇప్పటికైనా ఈ గ్రూపుల గోడలు బద్దలు కొట్టి, కలిసికట్టుగా పోరాడకపోతే రాబోయే ఎన్నికల్లో ఓటమి మూటగట్టుకోవడం ఖాయమని హెచ్చరిస్తున్నారు. మరి ఈ సంచలన పరిణామాలపై ఎమ్మెల్యే ఎంజీఆర్ ఎలాంటి యాక్షన్ తీసుకుంటారో.. మండల కమిటీ నేతలు తమ పంథా మార్చుకుంటారో లేదో చూడాలి!

## డ్రగ్స్‌తో జీవితాలను నాశనం

**మందస, జూన్ 17(వార్త):** మత్తు పదార్థాల వినియోగంతో జీవితాలు నాశనమవుతాయని, వీటిని దరిచేరనీయవద్దని కాశీబుగ్గ రూరల్ సీఐ పి.తిరుపతిరావు అన్నారు. మందస మండలంలోని జిల్లుండ గ్రామంలో నషా ముక్త్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానికులనుద్దేశించి తిరుపతిరావు మాట్లాడుతూ యువత డ్రగ్స్ కి దూరంగా ఉండాలని కోరారు. నసా ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమం ద్వారా యువతీ, యువకులను భాగస్వామ్యం చేసి డ్రగ్ ఫ్రీ ఇండియా ఛాలెంజ్ లో భాగంగా డ్రగ్ నిర్మూలనకై ప్రజలతో ప్రతిజ్ఞ చేయించారు. డ్రగ్స్ కి దూరంగా ఉండాలని మత్తు పదార్థాలు తో యువత జీవితం చిత్తు చేసుకోవద్దని హితవు పలికారు. డ్రగ్స్ వినియోగిస్తే.. వాటికి బానిస అవుతారని, కుటుంబాలపై ఈ ప్రభావం పడుతుందన్నారు. అంతేకాకుండా సమాజంలో చిన్నచూపునకు గురవుతారని, మనిషి ఆరోగ్యం పాడవుతుందన్నారు. కార్యక్రమంలో మందస పోలీసు స్టేషన్ సిబ్బంది కూడా పాల్గొన్నారు.





## ఓటర్లు బాధ్యతగా సరి చూసుకోవాలి

**మందస, జూన్ 17(వార్త):** భారత ఎన్నికల అధికారి వారి ఆదేశానుసారం 18సంవత్సరాలు పూర్తి చేసుకుని ఓటు హక్కు కలిగివున్న వయోజనులందరికీ మీ బూత్ లెవెల్ ఆఫీసర్ ద్వారా అందజేయబడుతున్న ఎన్యూమరేట్ ఫారంలో మీ పూర్తి సమాచారం సరి చూసుకోవలసిన బాధ్యత ఓటర్లదేనని రాంపురం బి.ఎల్.ఓ. సూపర్వైజర్, వెలుగు ఏపీఎం పైడి కూర్మారావు అన్నారు. మందస మండలంలోని రాంపురంలో సర్ సర్వేలో పాల్గొని, అక్కడి ఓటర్లతో మాట్లాడారు. మీకు ఇచ్చిన 2ఫారంలలో ఒక దానిపై ఫోటో అంటించి సంతకంతో పాటు తిరిగి అప్పగించి, డిజిటలైజేషన్ చేయించుకోవాలన్నారు. స్థానికంగా ఉండి 18సంవత్సరాలు పూర్తయిన యువతీయువకులు తప్పనిసరిగా ఓటు హక్కును నమోదు చేయించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బూత్ లెవెల్ ఆఫీసర్, పంచాయతీ కార్యదర్శి పద్మావతి, స్థానిక అంగన్వాడి కార్యకర్తలు, వెలుగు గ్రామ సంఘం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఎస్సీ వెల్ఫేర్ అసోసియేషన్‌ను కలిసిన 'పూలే పెరియార్ జైభీమ్ చైతన్యవేదిక' ప్రతినిధులు



**మందస, జూన్17(వార్త):** సమాజంలో విద్యా చైతన్యాన్ని, ఆత్మ గౌరవాన్ని పెంపొందించే లక్ష్యంతో పొత్తంగి-సిరిపురం గ్రామంలో నూతనంగా ఏర్పాటైన 'పూలే పెరియార్ జైభీమ్ చైతన్యవేదిక' ప్రతినిధులు ఆ తరం దళిత ఉద్యమ నేతలు, పెద్దలైన నగిరి లక్ష్మణరావు, కొత్తపల్లి మోహనరావులను మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా పెద్దలిద్దరికీ పుష్పగుచ్ఛాలు అందించి వేదిక కార్యవర్గ సభ్యులు సత్కరించారు. అక్షరమే ఆయుధం-చైతన్యమే మన బలం అనే నినాదంతో, బాబాసాహెబ్ అంబేద్కర్ ఆశయాల స్ఫూర్తితో గ్రామంలో తాము చేపట్టిన వేదిక ఏర్పాటు వివరాలను, సంఘ నూతన భవన నిర్మాణ విశేషాలను ప్రతినిధులు ఈ సందర్భంగా వారికి వివరించారు. ఈ సందర్భంగా పెద్దలు నగిరి లక్ష్మణరావు, కొత్తపల్లి మోహనరావులు మాట్లాడుతూ.. నూతన చైతన్యవేదిక ఏర్పాటు పట్ల అమితానందం వ్యక్తంచేశారు. గతంలో తాము చేసిన సామాజిక పోరాటాలు, ఉద్యమ అనుభవాలను ఈ తరం యువతతో పంచుకుంటూ.. సమాజంలో మార్పు కోసం విద్య ఎంత అవసరమో దిశా నిర్దేశం చేశారు. యువత అంతా ఐక్యతతో మెలిగి, గ్రామీణ విద్యార్థుల ఉన్నతికి నిరంతరం కృషి చేయాలని ఆకాంక్షిస్తూ వేదిక నూతన కార్యవర్గానికి తమ సంపూర్ణ ఆశీస్సులు, మద్దతును ప్రకటించారు. కార్యక్రమంలో వేదిక అధ్యక్షుడు సంక కాళిదాసు, ఉపాధ్యక్షుడు నగిరి తారకేశ్వరరావు, నిర్వహణ కార్యదర్శులు సంక నారాయణరావు, కదంబాల. ప్రవీణ్ కుమార్, కోశాధికారి ఇప్పిలి హేమసుందర్, క్రియాశీల కార్యదర్శులు తెప్ప లోహిదాస్, గేదెల పాపారావు, నగిరి గణపతి పాల్గొన్నారు.

## ట్రిపుల్ ఐటీకి ఎంపికైన భార్గవికి సన్మానం



**మందస, జూన్ 17(వార్త):** మందస మండలంలోని కొత్తపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుండి ఇటీవల విడుదలైన ఏపీ ట్రిపుల్ ఐటీ ఫలితాల్లో శ్రీకాకుళం క్యాంపస్ కు ఎంపికైన నెయ్యల భార్గవితో పాటు ఆమె తల్లిదండ్రులను పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయులు, సిబ్బంది ఘనంగా సన్మానించారు. భార్గవి గత ఎస్ఎస్సీ ఫలితాల్లో ఇదే పాఠశాల నుండి ప్రథమ స్థానంలో నిలవడంతో పాటుగా, పలు టాలెంట్ టెస్ట్, క్విజ్ లలో కొత్తపల్లి ఉన్నత పాఠశాలను ఉన్నత స్థానంలో నిలబెట్టడంలో ప్రధాన భూమిక పోషించిందని ప్రధానోపాధ్యాయుడు కూన వేణుగోపాలరావు అన్నారు. అనంతరం పాఠశాల ఉపాధ్యాయులు మాట్లాడుతూ విద్యార్థిని భార్గవిని ఆదర్శంగా తీసుకొని విద్యార్థులు భవిష్యత్ లో ఉన్నత స్థానానికి ఎదగాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు జి.భీమారావు, జి.జానకమ్మ, ఎం.లక్ష్మణరావు, ఎ.అప్పారావు, బి.పాపమ్మ, జి.సూర్యనారాయణ, జి.చిన్నికృష్ణ, ఎం.చిత్రసేను, ఎం.దామోదరం, జి.గోపాలకృష్ణ, బి.రమేష్, పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.

## శిథిల పాఠశాల భవనం పరిశీలన

**నరసన్నపేట, జూన్ 17(వార్త):** నరసన్నపేట పట్టణంలోని వంశధార కాలనీ వద్ద ఉన్న ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల భవనాన్ని మండల విద్యాశాఖ అధికారి ఉప్పాడ శాంతారావు బుధవారం పరిశీలించారు. శిథిలావస్థకు చేరుకున్న పాఠశాల భవనం పరిస్థితులను పరిశీలించి విద్యార్థుల భద్రతపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పాఠశాల భవనం మరమ్మతుల అవసరాన్ని గుర్తించి ఇప్పటికే ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపినట్లు తెలిపారు. ఇటీవల కురిసిన భారీ వర్షాల నేపథ్యంలో భవనం పరిస్థితి మరింత దెబ్బతినకుండా అవసరమైన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. విద్యార్థుల భద్రతకు ఎలాంటి ప్రమాదం కలగకుండా ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఉపాధ్యాయులకు సూచించారు. వర్షాకాలంలో తరగతి గదుల పరిస్థితిని నిరంతరం పర్యవేక్షిస్తూ విద్యార్థులకు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. పాఠశాల భవన మరమ్మతుల అంశాన్ని ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి త్వరితగతిన పరిష్కారం అయ్యేలా కృషి చేస్తామని ఎంఈవో ఉప్పాడ శాంతారావు తెలిపారు. విద్యార్థులకు మెరుగైన విద్యా వాతావరణం కల్పించడం విద్యాశాఖ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. ఈ పరిశీలన కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యాశాఖ సిబ్బంది పాల్గొన్నారు.



# తప్పుడు ప్రచారాలు తగదు

* కార్గో ఎయిర్ పోర్ట్ నిర్మాణానికి భూములు ఇవ్వం * అసత్య ప్రచారాన్ని ఖండించిన భేతాళపురం బాధిత రైతులు





**మందస, జూన్ 17(వార్త):** తప్పుడు ప్రచారాలతో కొంతమంది పబ్బం గడుపుకొంటున్నారని, ఎట్టి పరిస్థితుల్లో కార్గో ఎయిర్ ఫోర్ట్ నిర్మాణానికి భూములు ఇవ్వమని భేతాళపురం గ్రామం రైతులు అన్నారు. మందస మండలంలోని భేతాళపురం గ్రామంలో బుధవారం రైతులంతా ముక్తకంఠంతో గ్రీన్ ఫీల్డ్ ఎయిర్ పోర్ట్ నిర్మాణానికి సహకరించమని ప్రత్యేకంగా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇటీవల కొన్ని వార్తా పత్రికల్లో వచ్చినటువంటి సమాచారం ప్రకారం ఉద్దానం కార్గో ఎయిర్పోర్ట్ కోసం భూములు ఇవ్వడానికి భేతాళపురం గ్రామ రైతులు ముందుకు వచ్చారనేది పూర్తి స్థాయిలో అవాస్తవం అని బాధిత రైతులు, గ్రామస్తులు తెలిపారు. ఇటువంటి తప్పుడు ప్రచారాలు ఇకనైనా మానుకోవాలని, భూములు ఇచ్చేది లేదని తేల్చిచెప్పారు. గత 20 నెలలుగా పచ్చని మా ఉద్దాన భూముల్లో కార్గో ఎయిర్పోర్ట్ నిర్మాణం చేపట్టారాదని అనేక విధాలుగా నిరసనలు తెలియజేస్తూనే ఉన్నామన్నారు. జిల్లా కలెక్టర్ స్వప్నికల్ దినకర్ పుండ్కర్, స్థానిక శాసన సభ్యురాలు గౌతు శిరీష, కేంద్ర పౌర విమానయాన శాఖామంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు, ఇతర అధికారులకు, ప్రభుత్వ పెద్దలకు కూడా మా వైఖరి స్పష్టంగా తెలియజేసామన్నారు. వంశపారంపర్యంగా వస్తున్న మా భూములు నిత్యం ఆదాయం ఇచ్చే కొబ్బరి, జీడి, మామిడి, పనస, మునగ, మామిడి అలాగే మూడు పంటలు పండే పొలాలు ముఖ్యంగా కూరగాయలు, ఆకుకూరలు పండించే బంగారు భూములని కార్గో ఎయిర్పోర్ట్ నిర్మాణం కోసం తీసుకోని కార్పొరేట్ కంపెనీలకు కట్టబెట్టవద్దన్నారు. భూములనే నమ్ముకున్న రైతుల పొట్ట కొట్టవద్దని ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ విన్నవించుకున్నారు. గ్రామాలకు దూరంగా ఎక్కడైనా ప్రభుత్వ, అసైన్డ్ భూములు ఉంటే అక్కడ ఇటువంటి నిర్మాణాలు చేసుకోవాలని కోరారు. ఇకనైనా ఇలాంటి తప్పుడు ప్రచారాలు మానుకోవాలని, రైతుల అభిప్రాయాలు పరిగణలోకి తీసుకోవాలని కోరుతూ ఉద్దానం ప్రాంతంలో కార్గో ఎయిర్పోర్ట్ నిర్మాణాన్ని ముక్త కంఠంతో వ్యతిరేకించారు. కార్యక్రమంలో మడియా పురుషోత్తం, బత్తిని ఉమాపతి, గార ఆనందరావు, కార్గో ఎయిర్ పోర్ట్ వ్యతిరేక పోరాట కమిటీ మీడియా వింగ్ కన్వీనర్ బత్తిని లక్ష్మణ్, జుత్తు నారాయణ, సాహుకారి కృష్ణారావు, బత్తిని తులసి రావు, దున్న పార్వతి, కీలు గున్నమ్మ, మడియా రుషి, దున్న మోహనరావు, కోరిబిల్లి సుమలత, సాహుకారి ఉపేంద్ర, మడియా వల్లమ్మ, మహిళా రైతులు, యువకులు పాల్గొని నిరసన తెలిపారు.

### కలెక్టర్‌ను కలిసిన బాధిత రైతులు

మందస, వజ్రపుత్తూరు మండలంలోని బేతాళపురం, లక్ష్మీపురం, బిడిమి, చీపురుపల్లి, మెట్టూరు రెవెన్యూ గ్రామ పరిధిలో గల కార్గో ఎయిర్పోర్ట్ వ్యతిరేక పోరాట కమిటీ సభ్యులు, రైతులు కలిసి కలెక్టరేట్ ఆఫీస్‌లో జిల్లా కలెక్టర్ స్వప్నికల్ దినకర్ పుండ్కర్ ను కలిసారు. ఈ సందర్భంగా కలెక్టర్ కు వినతిపత్రం అందజేశారు. ప్రభుత్వం ప్రతిపాదించిన కార్గో ఎయిర్పోర్ట్ నిర్మాణ ప్రతిపాదన వలన మా ఉద్దాన ప్రాంతంలో రైతులందరం మా చర, స్థిరాస్తి భూములు పూర్తిస్థాయిలో కోల్పోవడం జరుగుతుందన్నారు. ఈ ప్రతిపాదనను మేము వ్యతిరేకిస్తూ గత 20 నెలలుగా అనేక విధాలుగా మీకు, మీ ఉన్నతాధికారులకు, స్థానిక ప్రజాప్రతినిధులకు అర్జీలు పెట్టుకున్నామన్నారు. ప్రభుత్వం వెంటనే ఈ ఎయిర్పోర్ట్ ప్రతిపాదనను విరమించుకోవాలని కోరుకుంటున్నామని, మా జీవనాధారమైన పచ్చని పంట భూములపైన సంతోషంగా జీవించే హక్కును కలిగిస్తారని, ఇకపై ఎటువంటి సర్వేలు గానీ భూసార పరీక్షలు గాని మా భూముల పైన చేయవద్దని కోరుతున్నామన్నారు. కార్యక్రమంలో కార్గో ఎయిర్ పోర్ట్ వ్యతిరేక పోరాట కమిటీ అధ్యక్షుడు కొమర వాసు, ప్రధాన కార్యదర్శి జోగి అప్పారావు, కార్గో ఎయిర్ పోర్ట్ వ్యతిరేక పోరాట కమిటీ మీడియా వింగ్ కన్వీనర్ బత్తిని లక్ష్మణ్, నల్ల పరుశురాం, సుంకర రాజు, రత్నాల భీమారావు, జోగి ఈశ్వరరావు, వాసుపల్లి సాంబమూర్తి, బడి సాంబమూర్తి, బర్రి జోగారావు, బర్రి ఉమాపతి, తెప్పల అప్పారావు, పొట్టి యోగేశ్వరరావు, తెప్పల గున్నయ్య, సందుపల్లి దిలీప్, గుంటు రామస్వామి, చిత్త సంతోష్, పుక్కల్ల బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



**మందస, జూన్ 17(వార్త):** మందస పట్టణంలో వైభవంగా 'గో గ్రీన్' మొక్కల పెంపకం కార్యక్రమం నిర్వహించడం అభినందనీయమని మందస(మంజూష) రాజుల వారసుడు డాక్టర్ ప్రతాప్ సింగ్ దేవ్ అన్నారు. పర్యావరణ పరిరక్షణే ధ్యేయంగా, ప్రకృతి సమతుల్యతను కాపాడుకుంటూ, భావితరాలకు పచ్చని వాతావరణాన్ని అందించాలనే సంకల్పంతో మందస మేజర్ పంచాయతీ పరిధిలో 'గో గ్రీన్' సంస్థ, 'ఎస్.ఎం.ఆర్.' ఫౌండేషన్ సంయుక్త సారథ్యంలో బుధవారం కార్యక్రమం నిర్వహించింది. కార్యక్రమంలో మందస పూర్వ సంస్థానాధీశుడు శ్రీశ్రీనివాస రాజమణి మనవడు డాక్టర్ విశాల్ ప్రతాప్ సింగ్ దేవ్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆయన స్వయంగా పార పట్టి, మందస మెయిన్ రోడ్డు పక్కన మొక్కలను నాటడం ద్వారా కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేవలం మొక్కలు నాటడమే కాకుండా, వాటిని వృక్షాలుగా మార్చేవరకు కాపాడాలనే సంకల్పంతో 'గో గ్రీన్' సంస్థ చేస్తున్న కృషిని కొనియాడారు. మందస పరిసర ప్రాంతాలను పచ్చనివనంగా మార్చడానికి తన వంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని ఆయన హామీ ఇచ్చారు. అనంతరం ఆయన బహుకరించిన ఐరన్ ట్రీ గార్డును మొక్కకు అమర్చారు. చాలాచోట్ల మొక్కలు నాటిన తర్వాత వాటి సంరక్షణను విస్మరించడం వల్ల అవి పశువుల పాలు కావడం లేదా నశించిపోవడం జరుగుతుంటుంది. అయితే, ఈ విషయాన్ని గమనించి వాటిని సంరక్షించే దిశగా అడుగులు వేయడం గో గ్రీన్ సంస్థ యొక్క నిబద్ధతకు నిదర్శనమని ఆయన కొనియాడారు. కార్యక్రమంలో మామిడి కోదండరావు, సంతోష్ కుమార్ పండా, ప్రభాకర్ పట్నాయక్, శ్రీనివాస్ పాడి, కిల్లంశెట్టి సత్యం, రాధాకృష్ణపట్నాయక్, నిరంజన్ బెహరా, రామారావు, హరి, భాస్కరరావు, ప్రదీప్ కుమార్ సాహు, పురుషోత్తం బెహరా, ప్రఫుల్ బెహరా, కృష్ణ కార్జీ తదితరులు పాల్గొన్నారు.

## సాంఘిక సంక్షేమ వసతి గృహాల సమస్యలు పరిష్కరించాలి




**మందస/శ్రీకాకుళం, జూన్ 17(వార్త):** రాష్ట్రంలో సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నడుస్తున్న ఎస్సీ, ఎస్టీ, బీసీ వసతి గృహాల దుస్థితిపై ఏఐఎస్ఎఫ్ శ్రీకాకుళం జిల్లా సమితి ఆధ్వర్యంలో మిల్ జంక్షన్ నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎన్.నాగభూషణం, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు డి.సోమశేఖర్, సిహెచ్ రవి మాట్లాడుతూ పేద విద్యార్థులకు విద్యనందించాలనే లక్ష్యంతో ఏర్పాటు చేసిన వసతి గృహాలు నేడు సమస్యలకు నిలయాలుగా మారాయని ఆరోపించారు. చాలా హాస్టళ్లలో శిథిలావస్థలో ఉన్న భవనాలు, విరిగిన కిటికీలు, తలుపులు, సరైన మరుగుదొడ్లు, తాగునీటి వసతి లేదని, పడకలు, దుప్పట్లు, దోమతెరలు కూడా అందడం లేదని, వర్షం వస్తే పైకప్పులు కారుతున్న పరిస్థితికి వచ్చేసాయన్నారు. వార్డెన్లు, కుక్, కమాటి, వాచ్‌మెన్ పోస్టులు భర్తీ చేయక. ఇంచార్జ్ వార్డులతో హాస్టళ్ల పర్యవేక్షణ గాలికొదిలేశారన్నారు. గిరిజన సంక్షేమ వసతి గృహాల్లో నాణ్యతమైన భోజనం అందక విద్యార్థులు చనిపోతున్నారని, వాటిని అరికట్టడంలో ఐటీడీఏ అధికారులు పూర్తిగా విఫలం చెందారని, అలాగే పెరుగుతున్న ధరలకు అనుగుణంగా మెస్ చార్జీలు నెలకు 3000రూపాయలకు పెంచాలని డిమాండ్ చేశారు ముఖ్యంగా విద్యార్థినిల వసతి గృహాలు ముందు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి భద్రతను పెంచాలని కోరారు. ఉన్నత విద్య అభ్యసించాలని సాంఘిక సంక్షేమ వసతి గృహాలకు వస్తున్న విద్యార్థులకు అభివృద్ధి పథంలో నడపడంలో రాష్ట్ర విద్యాశాఖ పూర్తిగా విఫలం చెందిందని తక్షణమే సమస్యలన్నీ పరిష్కారం చేయాలని లేని పక్షంలో ఈ రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థి ఉద్యమాన్ని చవిచూడక తప్పదని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు కార్తీక్, కౌశిక్ సహాయ కార్యదర్శిలు హర్ష, మనోహర్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

# జీడి రైతులకు ఇచ్చిన హామీలు అమలు చేయండి



**పలాస, జూన్ 17 (వార్త):** వ్యవసాయ శాఖ మంత్రి జీడి రైతులకు ఇచ్చిన హామీని ఎప్పుడు అమలు చేస్తారని సిపిఎం నాయకులు ప్రశ్నించారు. రాష్ట్ర ప్రభుత్వం జీడికి గిట్టుబాటు ధర ప్రకటించకపోవడంతో జీడి రైతాంగం తీవ్రమైన దోపిడికి గురవుతుందని సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి డి గోవిందరావు, కార్యదర్శివర్గ సభ్యులు కోనారి.మోహన రావు, జీడి రైతు సంఘం జిల్లా కన్వీనర్ తెప్పల. అజయ్ ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం పలాస మండలం మాకన్నపల్లి ప్రాంతంలో జీడి రైతులతో జరిగిన సమావేశం నిర్వహించారు. సందర్భంగా భక్తులు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం జీడీకి గిట్టుబాటు ధర ఇస్తామని, జీడి బోర్డు ఏర్పాటు చేస్తామని ఎన్నికల్లో ఇచ్చిన హామీని రెండు సంవత్సరాలు పూర్తయినప్పటికీ ఎన్నికల వాగ్దానం ఎందుకు అమలు జరపలేదని వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు .అచ్చెన్న నాయుడుని ప్రశ్నించారు .జీడి రైతాంగానికి గిట్టుబాటు ధర లేకపోవడంతో జీడి రైతులు తీవ్ర అన్యాయానికి గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జీడి కొనుగోలులో దళారీ వ్యవస్థను అరికట్టాలన్నారు. జీడిపప్పు ధర ఆకాశాన్ని అంటుతుంటే జీడిపిక్కదర పాతాళంలో ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. జీడికి గిట్టుబాటు ధర ఇవ్వడం వలన విస్తారంగా జీడిపంటలు పండి జీడి ఆధార పరిశ్రమలు వస్తాయని, తద్వారా వేలాది మందికి ఉపాధి దొరుకుతుందని, వలసలు నివారించబ డతాయని, ఈ ప్రాంతం అభివృద్ధి చెందుతుందని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం జీడిపిక్కల 80 కేజీలు బస్తాకు 16 వేల రూపాయలు ప్రకటించి ప్రభుత్వమే రైతు సేవా కేంద్రాల ద్వారా కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బత్తిన.ప్రసాద్, తెప్పల.రాజు, తెప్పల.అప్పలస్వామి, గేదెల.నీలకంఠం, అప్పలస్వామి, జుత్తు. పార్వతి, బత్తిన, సుశీల, ఎం గణపతి, యమ్.జీవనరావు తదితరులు పాల్గొన్నారు.

## హరిపురంలో కంటి వైద్య శిబిరం




**మందస, జూన్ 17(వార్త):** కోస్టల్ లయన్స్ క్లబ్, గాయత్రి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత నేత్ర వైద్య శిబిరం విజయవంతమైంది. మందస మండలంలోని హరిపురంలో లయన్స్ క్లబ్, గాయత్రి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నేడు హరిపురంలో ఉచిత కంటి వైద్య శిబిరం బజారువీధిలో గల కన్యకా పరమేశ్వరి కళ్యాణ మండపం నిర్వహించారు. ఉదయం 9గంటల నుండి 12గంటల వరకు శ్రీవెంకటేశ్వర పుష్పగిరి కంటి ఆసుపత్రి సౌజన్యంతో ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించగా.. కంటి చూపుతో బాధపడుచున్నవారు, దూరపు దృష్టి, దగ్గర దృష్టి సరిగ్గా లేనివారు, పూర్తిగా దృష్టి లోపం ఉన్నవారు, కంటి మీద దుర్మాసం ఉన్నవారు, కంటికి ఏరకమైన బాధ ఉన్న రోగులకు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించారు. శిబిరంలో 36 చికిత్సలకు ఎంపికయ్యారు. వీరికి ఉచిత రవాణా, వసతి సౌకర్యం కల్పించారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షుడు మార్పు వెంకటేశం, గాయత్రి ఛారిటబుల్ ట్రస్ట్ ఛైర్మన్ కొర్ల కన్నారావు, వైఎస్ఎన్ మూర్తి, మండెల్లి లక్ష్మణరావు, భానూజీ, పుల్లా వాసు, కొంచాడ సురేష్ కుమార్, డాక్టర్ ఎం.సత్యనారాయణ, కోఆర్డినేటర్ ఎస్.కాంతారావు, రత్నాల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## పలాసలో నేత్ర వైద్య శిబిరం




**పలాస, జూన్ 17 (వార్త):** పలాస సత్య సాయి సేవా సమితి ఆధ్వర్యంలో శంకర్ ఫౌండేషన్ సౌజన్యంతో ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. పలాస శ్రీ సత్య సాయి సేవా సమితి కన్వీనర్ ఇప్పిళ్లి తిరుమల ఈ శిబిరాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఆప్తల్మాజిస్ట్ రోణంకి వెంకట రమణ, శంకర్ ఫౌండేషన్ వైద్యులు, క్యాంప్ కోఆర్డినేటర్ సాయి పలాస సత్యసాయి సేవ సమితి కన్వీనర్ జెసిహెచ్ శ్రీనివాసరావు, బి వెంకట రమణ, జి కృష్ణారావు, టీ ప్రభాకర్, పి కౌంటేడు, మల్ల రామేశం, శ్రీనివాసరావు, లత, శ్రీలక్ష్మి తదితరులు రోగులకు సేవలు అందించారు.

## రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి



**సోంపేట, జూన్ 17 (వార్త):** బారువ నుండి సోంపేట ద్విచక్ర వాహనంపై వస్తున్న సోంపేట పట్టణంలో పకోడీ షాప్ నిర్వహిస్తున్న యువకుడు శశిభూషణ్(38) అదుపుతప్పి రోడ్డు మీద పడటంతో అక్కడిక్కడే మృతి చెందినట్లు సోంపేట ఎస్ఐ మోహిని తెలిపారు. ఈ మేరకు బుధవారం రాత్రి కంభ ప్రాంతంలో రోడ్డు పై పడి ఉన్న యువకుని చూసి స్థానికులు సోంపేట పోలీసులకు సమాచారం ఇవ్వటంతో సోంపేట ఎస్సై మోహిని సంఘటన స్థలానికి వెళ్లి పరిశీలించారు. బారువ నుండి సోంపేట వైపు ద్విచక్ర వాహన పై వస్తున్న యువకుడు అదుపుతప్పి పడడంతో తలకు బలమైన గాయం కావడంతో శశిభూషణ్ అక్కడక్కడ మృతి చెందినట్లు ఆమె గుర్తించారు. మృతి చెందిన యువకుడు సోంపేట పట్టణంలో ప్రధాన రహదారి ప్రక్కన పకోడీ, జిలాభి అమ్మే యువకుడన్నారు. మృతదేహాన్ని సోంపేట ప్రభుత్వ సామాజిక ఆసుపత్రికి తరలించినట్లు ఎస్ఐ తెలిపారు

జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

## డ్రగ్స్ జోలికి పోవద్దు

**పలాస, జూన్ 17 (వార్త):** డ్రగ్స్ జోలికి పోవద్దు... బంగారు జీవితాన్ని నాశనం చేసుకోవద్దు అని కాశీ బుగ్గ సిఐ వై రామకృష్ణ తెలిపారు. బుధవారం కోసంగిపురం గ్రామంలో కాశీబుగ్గ పోలీసుల ఆధ్వర్యంలో మాదకద్రవ్యాల నిర్మూలనపై విస్తృత అవగాహన కార్యక్రమం నిర్వహించారు. యువత, మహిళలు, విద్యార్థులు, గ్రామస్తులకు మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే దుష్పరిణామాలు, ఆరోగ్యంపై, భవిష్యత్తుపై పడే ప్రభావాలను వివరించారు. ఈకార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఎన్ని రామకృష్ణ మాట్లాడుతూ మాదకద్రవ్యాల బారిన పడకుం డా యువత అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మత్తు పదార్థాలు వ్యక్తిగత జీవితాలను మాత్రమే కాకుండా కుటుంబాలు, సమాజాన్ని కూడా తీవ్రంగా దెబ్బతీస్తాయని పేర్కొన్నారు. యువత తమ లక్ష్యాలను సాధించేందుకు క్రమశిక్షణతో కూడిన జీవన విధానాన్ని అలవర్చుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, ప్రజాప్రతి నిధులు, యువకులు, మహిళలు, విద్యార్థులు, కాశీబుగ్గ పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# 14 ఏళ్ల నిరీక్షణ ఫలించింది

*** అబలసింగి గిరిజన చిన్నారులకు సొంత పాఠశాల భవనం * భగత్ సింగ్ చారిటబుల్ ట్రస్ట్ చొరవతో నెరవేరిన కల * రెండు దశాబ్దాలుగా ఆరుబయటే చదువులు * కృతజ్ఞతలు చాటుకున్న గిరిజన గ్రామస్థులు**

**కొత్తూరు, జూన్ 17 (వార్త):** పాలకుల నిర్లక్ష్యం, అధికారుల ఉదాసీనత వల్లేమో కానీ.. ఆ గిరిజన చిన్నారుల చదువుకు 14 ఏళ్లుగా ఆరుబయటే దిక్కైంది. ఎండనక, వాననక వారు పడిన అవస్థలు అన్నీ ఇన్నీ కావు. ఎట్టకేలకు ఆ మారుమూల గిరిజన గ్రామ చిన్నారుల దశాబ్ద కాలపు నిరీక్షణకు తెరపడింది. ఒక స్వచ్ఛంద సంస్థ ఉదారతతో విద్యార్థులకు సురక్షితమైన సొంత పాఠశాల భవనం అందుబాటులోకి వచ్చింది.కొత్తూరు మండలం, అడ్డంగి పంచాయతీ పరిధిలోని మారుమూల గిరిజన గ్రామం అబలసింగి. ఈ గ్రామంలోని ప్రాథమిక పాఠశాలకు 2012లోనే ప్రభుత్వం భవనాన్ని మంజూరు చేసింది. కానీ, నేటికీ 14 సంవత్సరాలు గడిచినా భవన నిర్మాణం మాత్రం అడుగు ముందుకు పడలేదు. దీంతో సరైన వసతి లేక విద్యార్థులు చెట్ల కింద, ఆరుబయటే చదువుకోవాల్సి వచ్చింది. వర్షం వస్తే సెలవు ఇవ్వడం, ఎండలు ముదిరితే తరగతులు నిలిపివేయడంతో వీరి చదువులకు తరచూ అంతరాయం కలిగేది.కొత్తూరు కేంద్రానికి సుమారు 23 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఈ గ్రామానికి నేరుగా రాకపోకల సౌకర్యం లేదు. సీతంపేట మండలం మీదుగా గిరిశిఖర ప్రాంతాన్ని దాటుకుంటూ అబలసింగి చేరుకోవాల్సి ఉంటుంది. కనీస మౌలిక వసతులు లేకపోవడంతో ఇటు విద్యార్థులతో పాటు, అటు పాఠశాల ఉపాధ్యాయులు సైతం నిత్యం నరకయాతన అనుభవించారు. సమస్యను పరిష్కరించాలని గ్రామస్తులు, తల్లిదండ్రులు ఎన్నో ఏళ్లుగా ప్రజాప్రతినిధులకు, జిల్లా అధికారులకు వినతిపత్రాలు అందించినా ఫలితం లేకుండా పోయింది.ఆపన్నహస్తం అందించిన 'భగత్ సింగ్ ట్రస్ట్'..చిన్నారుల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారిన తరుణంలో.. గ్రామ పెద్దలు ఈ సమస్యను 'శ్రీ భగత్ సింగ్ చారిటబుల్ ట్రస్ట్' సభ్యుల దృష్టికి తీసుకెళ్లారు. సమస్య తీవ్రతను గుర్తించిన ట్రస్ట్ సభ్యులు ఏమాత్రం ఆలస్యం చేయకుండా స్పందించారు. ప్రభుత్వ నిధుల కోసం ఎదురుచూడకుండా, తమ సొంత నిధులు సుమారు ఒక లక్ష రూపాయల వ్యయంతో పాఠశాల భవన నిర్మాణాన్ని చేపట్టి సకాలంలో పూర్తి చేశారు.పాఠశాల భవనంతో పాటు విద్యార్థుల విద్యా సామగ్రి బాధ్యతను కొత్తూరుకు చెందిన 'మహదేవ్ లక్కీ ఫిట్నెస్ జిమ్' యాజమాన్యం పంచుకుంది. విద్యార్థులకు అవసరమైన పుస్తకాలు, నోట్‌బుక్స్, పలకలు, పెన్నులతో పాటు పాఠశాల గదులకు అవసరమైన ఫ్యాన్లను ఉచితంగా అందజేసి తమ దాతృత్వాన్ని చాటుకున్నారు.ఎన్నికల సమయంలో ఓట్ల కోసం వచ్చే నాయకులు హామీలు ఇచ్చి వెళ్లడమే తప్ప, తమ కష్టాలను ఎవరూ పట్టించుకోలేదని గ్రామస్తులు ఈ సందర్భంగా ఆవేదన వ్యక్తం చేశారు. మాటలకే పరిమితం కాకుండా చేతల్లో సేవాభావాన్ని చాటి, తమ పిల్లల భవిష్యత్తుకు బాటలు వేసిన శ్రీ భగత్ సింగ్ చారిటబుల్ ట్రస్ట్ సభ్యులకు గ్రామస్తులు, తల్లిదండ్రులు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. భవన నిర్మాణం పూర్తి కావడంతో అబలసింగి గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది.ఈ సందర్భంగా ట్రస్ట్ సభ్యులు మాట్లాడుతూ"విద్య అనేది ప్రతి చిన్నారి హక్కు" అనే భావనతో తాము ఈ కార్యక్రమాన్ని చేపట్టామని, గిరిజన ప్రాంతాల్లో విద్యాభివృద్ధికి తమ వంతు కృషి ఎల్లప్పుడూ కొనసాగుతుందని ట్రస్ట్ ప్రతినిధులు స్పష్టం చేశారు. స్వచ్ఛంద సంస్థ చేసిన ఈ బృహత్తర కార్యం సమాజంలోని ఇతర సేవా సంస్థలకు ఆదర్శంగా నిలుస్తుందని స్థానికులు కొనియాడుతున్నారు.




## సముద్రంలో పడవ బోల్తా

*** ఈదుకొని ఒడ్డుకు చేరుకున్న ఐదుగురు మత్స్యకారులు**



**పలాస, జూన్ 17 (వార్త):** వజ్రపుకొత్తూరు మండలం దేవునల్తాడ సమీప సముద్ర తీర ప్రాంతంలో పడవ మంగళవారం అర్ధరాత్రి దాటిన తర్వాత చేపల వేటకు ఐదుగురు మత్స్యకారులు వెళ్లారు. అలల ఉధృతం కారణంగా పడవ బోల్తా పడింది. తృటిలో ప్రమాదం నుంచి తప్పించుకున్న మత్స్యకారులు గారయ్య, హేమారావు, ఎర్రన్న, జోగారావు, అప్పన్నలు ఈదుకుంటూ వచ్చారు. వీరిని గమనించిన కొందరు మత్స్యకారులు పడవపై వీరిని సురక్షితంగా ఒడ్డుకు చేర్చారు. ఈ ఘటనలో ఎలాంటి ప్రాణనష్టం జరగకపోవడంతో గ్రామస్తులు ఊపిరి పీల్చుకున్నారు. మత్స్యకారులు సురక్షితంగా బయటపడటంతో వారి కుటుంబ సభ్యులు ఆనందం వ్యక్తం చేశారు.

## రహదారుల అభివృద్ధితోనే ఆ ప్రాంత అభివృద్ధి



**పలాస, జూన్ 17 (వార్త):** వజ్రపుకొత్తూరు మండలం అమలపాడు పంచాయతీ. చింతవానిపేట జంక్షన్ నుంచి కారాడ తోటలు వరకు వయా జంగమయ్య తోటలు వరకు 2 కిలోమీటర్లు రోడ్డుకు సుమారు రూ. కోటి పది లక్షల పంచాయతీ రాజ్ నిధులు మంజూరు కావడంతో బుధవారం చింతవానిపేట కూడలిలో పలాస నియోజకవర్గ జనసేన పార్టీ ఇన్ చార్జి డాక్టర్ దుర్గారావు జనసేన నాయకులు, జనవాహిని మధ్య కొబ్బరికాయ కొట్టి రోడ్డు పనులను ప్రారంభించారు. ఆనంతరం దుర్గా రావు మాట్లాడుతూ గత వైసిపి పాలనలో రోడ్లు నిర్వీర్యం అయ్యాయన్నారు. ఎన్‌డిఏ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన మొదటి సంవత్సరంలోనే, పల్లె పండగ కార్యక్రమంలో భాగంగా అనేక గ్రామాలలో రోడ్లు వేశామన్నారు. ఆందులో బాగంగానే ఈరోజు రోడ్డు పనులు ప్రారంభించి పూర్తి చేసినట్లు చెప్పారు. గ్రామాలను అనుసంధానం చేస్తూ లింక్ రోడ్లకు ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు. గత వైఎస్ఆర్‌సీపీ పాలనలో నిధులు మంజూరు చేయకుండానే రోడ్డు పనులకు శంకుస్థాపన చేసి ప్రజలను మోసగించారని విమర్శించారు. దశాబ్దాలుగా సరైన రహదారులు లేకపోవడం, రోడ్లు అధ్వాన స్థితిలో ఉండటంతో ప్రాంత ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. చింతవానిపేట గ్రామస్తుల చిరకాల కోరికను నెరవేర్చిన ఉప ముఖ్యమంత్రి, జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్కి గ్రామస్తులు, జనసేన నాయకులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. నియోజకవర్గంలో రహదారుల అభివృద్ధి, కొత్త రోడ్ల నిర్మాణానికి నిధులు సాధించడంలో, మౌలిక వసతుల కల్పనపై డాక్టర్ దుర్గారావు ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నారని జనసేన నాయకులు అన్నారు. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల ఆధ్వర్యంలో 'పల్లె పండుగ' వంటి కార్యక్రమాలతో రోడ్ల నిర్మాణాలు వేగంగా జరిగాయని దుర్గారావు పేర్కొన్నారు . ఈ కార్యక్రమంలో మండల జనసేన నాయకులు దువ్వాడ వంశీకృష్ణ చౌదరి, అర్జీ తులసీరావు, కీలు సునీల్ వర్మ, పుచ్చ భీమారావు, డి.కె. రామారావు, దున్నా అనిల్, దున్న. పెంటా రావు, దున్న డిల్లీరావు, తామాడ పాపారావు, తిరుపతి రావు, వీర మహిళలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## పెనుగాలులకు పాఠశాలలో కూలిన చెట్టు కొమ్మలు

**సారవకోట, జూన్ 17 (వార్త):** సారవకోట మండల కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఆవరణలో బుధవారం ఉదయం పెనుగాలులకు భారీ చెట్టు కూలిపోయింది. అయితే ఘటన సమయంలో విద్యార్థులకు ఎటువంటి ప్రమాదం జరగకపోవడంతో పాఠశాల సిబ్బంది, తల్లిదండ్రులు ఊపిరి పీల్చుకున్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సీహెచ్. అప్పన్న తెలిపిన వివరాల ప్రకారం, బుధవారం ఉదయం ప్రాంతంలో భారీ వర్షంతో పాటు బలమైన ఈదురుగాలులు వీచాయి. దీంతో పాఠశాల ప్రాంగణంలో ఎన్నో సంవత్సరాలుగా ఉన్న పెద్ద చెట్టు ఒక్కసారిగా నేలకొరిగింది. ఘటన సమయంలో విద్యార్థులు సురక్షిత ప్రాంతంలో ఉండటంతో ఎలాంటి ప్రాణనష్టం లేదా గాయాలు జరగలేదని ఆయన తెలిపారు. చెట్టు కూలిపోవడంతో పాఠశాల ఆవరణలో కొంత మేర అంతరాయం ఏర్పడినప్పటికీ పెద్ద ప్రమాదం తప్పిందన్నారు. సమాచారం అందుకున్న స్థానికులు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని చెట్టును తొలగించే పనుల్లో సహకరించారు. పాఠశాల కార్యకలాపాలకు ఇబ్బంది కలగకుండా చర్యలు చేపట్టినట్లు హెచ్‌ఎం వివరించారు. వర్షాకాలం ప్రారంభమవుతున్న నేపథ్యంలో పాఠశాలలు, ప్రభుత్వ కార్యాలయాలు, ప్రజా ప్రదేశాల్లో ప్రమాదకర స్థితిలో ఉన్న చెట్లను గుర్తించి తగిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు జరగకుండా ముందస్తు జాగ్రత్తలు అవసరమని అభిప్రాయపడుతున్నారు.

## మాదకద్రవ్యాల నిల్వలపై ఈగల్ టీం ప్రత్యేక నిఘా

**సారవకోట, జూన్ 17 (వార్త):** మాదకద్రవ్యాల వినియోగం, నిల్వలు, అక్రమ రవాణాపై ఈగల్ టీం ప్రత్యేక దృష్టి సారిస్తోందని టీం సభ్యులు రామచంద్రరావు, ఉదయ్ కుమార్ తెలిపారు. మాదకద్రవ్యాల నియంత్రణలో ప్రజల సహకారం కూడా ఎంతో అవసరమని వారు పేర్కొన్నారు. బుధవారం సారవకోట మండలంలోని ప్రధాన రహదారులతో పాటు పలు వ్యాపార సంస్థలు, దుకాణాల వద్ద డాగ్ స్క్వాడ్ సహాయంతో విస్తృత స్థాయిలో తనిఖీలు నిర్వహించారు. అనుమానాస్పద ప్రాంతాలను పరిశీలిస్తూ మాదకద్రవ్యాల నిల్వలు లేదా అక్రమ కార్యకలాపాలు జరగకుండా నిఘా చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, యువతను మాదకద్రవ్యాల బారిన పడకుండా కాపాడేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోందన్నారు. మాదకద్రవ్యాల వినియోగం వ్యక్తిగత ఆరోగ్యానికే కాకుండా కుటుంబాలు, సమాజంపై కూడా తీవ్ర ప్రభావం చూపుతుందని వివరించారు. ఎవరైనా మాదకద్రవ్యాలను వినియోగిస్తున్నట్లు, విక్రయి స్తున్నట్లు లేదా నిల్వ ఉంచినట్లు సమాచారం తెలిసినా వెంటనే ఈగల్ టీం సభ్యులకు లేదా సమీప పోలీసు అధికారులకు తెలియజేయాలని కోరారు. సమాచారం అందించిన వారి వివ రాలను గోప్యంగా ఉంచుతామని స్పష్టం చేశారు.



## జీడిపప్పు పర్మిట్ విధానం వాయిదా వేయండి

*** మంత్రి అచ్చెన్నాయుడు, కలెక్టర్ దృష్టికి పలాస పారిశ్రామిక సంఘం**

**పలాస, జూన్ 17 (వార్త):** జీడిపప్పు రవాణాపై రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా తీసుకొచ్చిన ట్రాన్స్‌పోర్ట్ పర్మిట్ విధానం అమలును తక్షణమే వాయిదా వేయాలని పలాస నోటిఫైడ్ మున్సిపల్ ఇండస్ట్రియల్ ఏరియా సర్వీస్ సొసైటీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఇటీవల జిల్లా కేంద్రంలో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడుతో పాటు జిల్లా కలెక్టర్ దృష్టికి ఈ సమస్యను తీసుకెళ్లారు. అనంతరం సొసైటీ చైర్మన్ మల్ల కామేశ్వరి, కార్యదర్శి తుముల శ్రీనివాసరావు, కోశాధికారి కొంచాడ వినయ్ సంయుక్తంగా వ్యవసాయ శాఖ మంత్రికి వినతిపత్రం సమర్పించారు. శ్రీకాకుళం జిల్లా కలెక్టర్ ద్వారా మంగళవారం ఈ లేఖను పంపించారు. రాష్ట్ర వ్యవసాయ శాఖ 27.05.2026న విడుదల చేసిన ఉత్తర్వు ప్రకారం జీడిపప్పు రవాణాకు ట్రాన్స్‌పోర్ట్ పర్మిట్ సిస్టమ్ 01.07.2026 నుండి అమలులోకి రానుంది. ఎటువంటి ముందస్తు చర్చలు లేకుండా, వాటాదారులకు అవగాహన కల్పించకుండా హడావుడిగా ఈ విధానం తెస్తున్నారని పారిశ్రామికవేత్తలు అభిప్రాయపడుతున్నారు. ప్రస్తుత రూపంలో పర్మిట్ సిస్టమ్ అమలు చేస్తే జీడిపప్పు పరిశ్రమకు తీవ్ర ఇబ్బందులు తప్పవని సొసైటీ లేఖలో స్పష్టం చేసింది. ఆంధ్రప్రదేశ్‌లో జీడిపప్పు ప్రాసెసింగ్ పరిశ్రమ 90 శాతం దిగుమతి చేసుకున్న, ఇతర రాష్ట్రాలైన ఒడిశా, కర్ణాటక, తమిళనాడు, కేరళ నుంచి వచ్చే ముడి జీడిపప్పుపై ఆధారపడి నడుస్తోందని లేఖలో వివరించారు. కేవలం శ్రీకాకుళం జిల్లాలోని పలాస, కాశీబుగ్గ ప్రాంతంలోనే 200కు పైగా ప్రాసెసింగ్ యూనిట్లు ఉన్నాయి. ఈ పరిశ్రమ ప్రత్యక్షంగా 15 వేల మందికి, పరోక్షంగా మరో 30 వేల మందికి ఉపాధి కల్పిస్తోంది. మహిళా కార్మికులే అధికంగా ఈ పరిశ్రమపై ఆధారపడి జీవిస్తున్నారు. కొత్త పర్మిట్ విధానం వల్ల ముడి సరుకు సేకరణ దగ్గర నుంచి ప్రాసెసింగ్, తుది ఉత్పత్తి రవాణా వరకు ప్రతి దశలోనూ జాప్యం జరుగుతుందని వ్యాపారులు ఆవేదన వ్యక్తం చేశారు. ఒక్కో లారీకి పర్మిట్ తీసుకోవడం, అధికారుల అనుమతులు, ఆన్‌లైన్ నమోదు వంటి ప్రక్రియలతో అదనపు భారం పడుతుందని తెలిపారు. సకాలంలో ముడి సరుకు రాకపోతే యూనిట్లు మూతపడే పరిస్థితి వస్తుందని, దీంతో వేలాది కుటుంబాలు ఇబ్బంది పడతాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వ ఉత్తర్వు అమలు తేదీని కనీసం ఆరు నెలలు వాయిదా వేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమయంలో వాటాదారులు, వ్యాపారులు, రవాణాదారులకు కొత్త వ్యవస్థపై పూర్తి అవగాహన కల్పించాలని కోరారు. ట్రాన్స్‌పోర్ట్ పర్మిట్ విధానాన్ని కేవలం ముడి జీడిపప్పుకు మాత్రమే పరిమితం చేయాలని సూచించారు. ప్రాసెస్ చేసిన జీడిపప్పు, జీడిపప్పు పలుకులు, విలువ ఆధారిత ఉత్పత్తులకు ఈ నిబంధన వర్తింపజేస్తే ఎగుమతులు పూర్తిగా దెబ్బతింటాయని పేర్కొన్నారు. "పలాస జీడిపప్పుకు భౌగోళిక గుర్తింపు ఉంది. దేశ విదేశాలకు ఎగుమతి అవుతోంది. హడావుడిగా తీసుకున్న నిర్ణయాలతో 100 ఏళ్ల చరిత్ర ఉన్న ఈ పరిశ్రమ మనుగడకే ప్రమాదం ఏర్పడుతుంది" అని సొసైటీ కార్యదర్శి తుముల శ్రీనివాసరావు పేర్కొన్నారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి పరిశ్రమ ప్రతినిధులతో సమావేశం ఏర్పాటు చేసి, సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని కోరారు. ఈ కార్యక్రమంలో పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష, పలాస ఏఎంసీ చైర్మన్ మల్ల శ్రీనివాస్‌తో పాటు పలువురు జీడి పరిశ్రమ యజమానులు పాల్గొన్నారు.



## చక్రతీర్థ ఘాట్ రహదారి అభివృద్ధికి చర్యలు చేపట్టాలి

**జలుమూరు, జూన్17(వార్త):** దక్షిణ కాశీగా ప్రసిద్ధి చెందిన శ్రీముఖ లింగేశ్వర క్షేత్రంలోని వారాహి సమేత శ్రీముఖలింగేశ్వరస్వామివారి చక్రతీర్థ ఘాట్‌కు వెళ్లే రహదారి గత రెండు దశాబ్దాలుగా అధ్వాన స్థితిలో ఉండటంతో యాత్రికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని కాంగ్రెస్ నాయకులు ఆందోళన వ్యక్తం చేశారు. రహదారి అభివృద్ధికి వెంటనే చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్‌ను కోరారు. చక్రతీర్థ ఘాట్‌కు వెళ్లే మార్గంలో సరైన సిమెంట్ రహదారి లేకపోవడంతో పాటు రహదారి చాలా ఇరుకుగా ఉండటంతో ప్రతి సంవత్సరం ఆలయ ఉత్సవాలు, ముఖ్యంగా మహాశివరాత్రి సందర్భంగా వేలాది మంది భక్తులు ఇబ్బందులు పడుతున్నారని స్థానికులు పేర్కొన్నారు. ఈ సమస్యను పలుమార్లు జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఇప్పటివరకు శాశ్వత పరిష్కారం లభించలేదని వాపోయారు. గత మహాశివరాత్రి ఉత్సవాల సమయంలో జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఆర్డీవో రహదారి అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేసి, రహదారి విస్తరణకు అవసరమైన భూసేకరణ అంశంపై రైతులకు నష్టపరిహారం అందించే చర్యలు చేపట్టాలని సూచించినప్పటికీ, అవి అమలుకు నోచుకోలేదని తెలిపారు. ఈ నేపథ్యంలో డీసీసీ అధ్యక్షుడు మరియు రాష్ట్ర కాంగ్రెస్ నాయకుడు అన్నాజీరావు, నాయుడుగారి రాజశేఖర్, మామిడి సత్యం, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు గుంట కర్ణ వీరుడు, గ్రామస్తులు కలిసి రహదారి పరిస్థితిని పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, శ్రీముఖలింగేశ్వర క్షేత్రానికి వచ్చే భక్తుల సౌకర్యార్థం చక్రతీర్థ ఘాట్ రహదారిని విస్తరించి సిమెంట్ రహదారిగా అభివృద్ధి చేయాలని డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న ప్రణాళికలను పునఃసమీక్షించి త్వరితగతిన పనులు ప్రారంభించేలా జిల్లా కలెక్టర్ చర్యలు తీసుకోవాలని కోరారు. ఆధ్యాత్మిక, పర్యాటక ప్రాధాన్యం కలిగిన ఈ ప్రాంతంలో మౌలిక సదుపాయాల అభివృద్ధి అత్యవసరమని, రహదారి అభివృద్ధితో భక్తులకు మెరుగైన సౌకర్యాలు అందుబాటులోకి వస్తాయని వారు అభిప్రాయపడ్డారు.



## క్షేత్రస్థాయిలో టిడిపిని బలోపేతం చేయాలి

**పలాస, జూన్ 17 (వార్త):** తెలుగుదేశం పార్టీని క్షేత్రస్థాయిలో బలోపేతం చేయాలని తెలుగు తమ్ముళ్లకు, కార్యకర్తలకు జిల్లా గ్రంథాలయ చైర్మన్ పీరుకోట్ల విఠల్ దిశానిర్దేశం చేశారు.రాష్ట్ర పార్టీ ఆదేశాలమేరకు బుధవారం పలాస టిడిపి కార్యాలయంలో మూడువ బుధవారం కెడర్ సమావేశం పార్లమెంటరీ కార్యదర్శి పి విఠల్ రావు నిర్వహించారు. ఓటర్ల జాబితా సవరణ, బూత్ లెవెల్ ఏజెంట్లు అందరూ అప్రమత్తంగా ఉండాలని, ఓటర్ల జాబితాలో జరిగే మార్పులు-చేర్పులను నిశితంగా గమనించాలని సూచించారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను క్షేత్రస్థాయిలో ప్రజల్లోకి తీసుకెళ్లడం. నాయకులు, కార్యకర్తలు వారానికి కనీసం నాలుగు రోజులైనా ప్రజల మధ్యే ఉండేలా ప్లాన్ చేయడంతోపాటు ఇటీవల మహానాడులో ప్రకటించిన మహిళలకు 33 శాతం ప్రాతినిధ్యం వంటి కీలక నిర్ణయాలను క్షేత్రస్థాయి కమిటీలలో అమలచేయాలని సూచించారు. స్థానిక కార్యకర్తల బాగోగులు చూసుకోవడం, క్షేత్రస్థాయిలో ఎదురవుతున్న సమస్యలపై పార్టీ ఇన్‌ఛార్జ్‌లు, ఎమ్మెల్యేలతో చర్చించడం వంటి వాటిపై దృష్టి పెట్టాలని సూచించారు. ఈ సమావేశంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ పిరికట్ల విఠల్ రావు, ఎయంసి చైర్మన్ మళ్ళా శ్రీనివాస్, పిఏసియస్ అధ్యక్షుడు వంకల కూర్మారావు, మందస మండల అధ్యక్షుడు భావన దుర్యోధన, క్లస్టర్ కన్వీనర్ గంగారాం, కూమార్ రాజు, సవర రాంబాబు, ఉమామహేశ్వరరావు, పిసియస్ వైఎస్ చెర్మన్ చంద్రకళ, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.




## యువత డ్రగ్స్‌కి దూరంగా ఉండాలి

**ఇచ్ఛాపురం, జూన్ 17 (వార్త):** నసా ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమం ద్వారా యువతి యువకులను భాగస్వామ్యం చేసి డ్రగ్ ఫ్రీ ఇండియా ఛాలెంజ్ లో భాగంగా డ్రగ్ నిర్మూలనకై ఇచ్చాపురం టౌన్ ఎస్ఐ ఎం.ముకుంద రావు ఇచ్చాపురం పట్టణ యువతీ యువకులు ప్రజలతో ప్రతిజ్ఞ చేయించారు.డ్రగ్స్ కి దూరంగా ఉండాలని మత్తు పదార్థాలు తో యువత జీవితం చిత్తు చేసుకోవద్దని అన్నారు.



# 21న పగడ్బందీగా నీట్ పరీక్ష

*** పరీక్ష రాయనున్న 2103 మంది విద్యార్థులు * నాలుగు పరీక్షా కేంద్రాలు * కేంద్రాలకు మధ్యాహ్నం 1.30 గంటలు దాటితే అనుమతి లేదు * రైల్వే స్టేషన్, ఆర్టీసీ కాంప్లెక్స్‌ల వద్ద హెల్ప్ డెస్క్‌లు * జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్**

**శ్రీకాకుళం, జూన్ 17 (వార్త):**నీట్ పరీక్ష అత్యంత పగడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ స్పష్టం చేశారు. జూన్ 21న జరుగనున్న నీట్ పరీక్షపై కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో బుధవారం జిల్లా సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ కె.వి. మహేశ్వరరెడ్డితో కలిసి ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరీక్ష కేంద్రాల వద్ద నలుగురు తహసిల్దార్లు (మేజిస్ట్రేట్లు) ఉంటారన్నారు. ముందుగా పరీక్ష కేంద్రాలకు చేరుకొని పరిశీలన చేయాలన్నారు. విద్యుత్ అంతరాయం ఉన్న ప్రాంతాలను గుర్తించాలన్నారు. వర్షం వస్తే అక్కడ కిటికీలు నుండి వర్షం రాకుండా చూడాలన్నారు. పరీక్ష పేపర్లు నిల్వ ఉంచే ప్రాంతం వద్ద పోలీసు బందోబస్తు, సిసి కెమెరాలు ఉన్నది లేనిది చూసి రోజుకు మూడు సార్లు వెళ్లి పరిశీలన చేయాలని తహసీల్దార్ గణపతిరావును ఆదేశించారు. పరీక్ష కేంద్రాలకు దగ్గరలో జిరాక్స్ షాపులు లేకుండా చూడాలన్నారు. జిల్లాలో నీట్ పరీక్షకు 2103 మంది విద్యార్థులు హాజరు కానున్నారని, 4 పరీక్షా కేంద్రాల్లో నీట్ పరీక్ష నిర్వహణ జరుగనున్నట్లు వెల్లడించారు. రాజీవ్ గాంధీ యూనివర్సిటీ ఆఫ్ నాలెడ్జ్ టెక్నాలజీస్, ఎస్‌ఎం పురం, ఎచ్చెర్ల మండలంలో 720 మంది, ప్రభుత్వ డిగ్రీ కళాశాల బాలురు లో 696 మంది, కేంద్రీయ విద్యాలయం వద్ద పెదపాడులో 447 మంది, ప్రభుత్వ పాలిటెక్నిక్, గుజరాతిపేటలో 240 మంది విద్యార్థులు హాజరు కానున్నట్లు చెప్పారు. పరీక్ష మధ్యాహ్నం 2 గంటల నుండి సాయంత్రం 5:20 గంటల వరకు జరుగుతుందన్నారు. అభ్యర్థులు పరీక్ష కేంద్రాలకు ముందుగానే చేరుకోవాలన్నారు. మధ్యాహ్నం 1:30 గంటలు దాటిన తర్వాత ఎట్టి పరిస్థితుల్లోనూ అభ్యర్థులను పరీక్ష కేంద్రంలోనికి అనుమతించరని చెప్పారు. పరీక్ష కేంద్రాల వద్ద గట్టి పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలన్నారు. పరీక్ష కేంద్రాల వద్ద వైద్య ఆరోగ్య శాఖకు సంబంధించి వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని డిఎంహెచ్ఓ ను, విద్యుత్ అంతరాయం లేకుండా చూడాలని ఎపిఈపిడిసిఎల్ అధికారులను ఆదేశించారు. విద్యార్థులు పరీక్ష కేంద్రాలకు చేరుకునేందుకు వీలుగా ఆర్టీసి బస్సులు ఏర్పాటు చేయాలన్నారు. పరీక్ష కేంద్రాలకు హాజరయ్యే అభ్యర్థులు హాల్ టికెట్లు చూపిస్తే ఉచిత బస్సు ప్రయాణం ఉంటుందని ఆర్టీసీ డిఎం అమరసింహుడు వివరించారు. ఫ్లెక్సీ బేనర్లు ఏర్పాటు చేయాలన్నారు. అభ్యర్థులు పరీక్ష కేంద్రాలకు అడ్మిట్ కార్డ్, రెండు పాస్పోర్ట్ సైజు ఫొటోలు, కార్డ్ సైజ్ ఫొటో ఒకటి, గుర్తింపు కార్డు, ట్రాన్సపరెంట్ వాటర్ బాటిల్ మాత్రమే అనుమతించబడునని చెప్పారు. ఆమదాలవలస రైల్వే స్టేషన్ నుండి పరీక్ష కేంద్రాలకు బస్సులను నడపాలని ఆదేశించారు. పరీక్ష కేంద్రాల చిరునామా తెలిపేందుకు ఆముదాలవలస రైల్వే స్టేషన్, ఆర్టీసీ కాంప్లెక్స్ లో వద్ద హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేయాలన్నారు. పరీక్ష కేంద్రాల వద్ద సీసీ కెమెరాలు ఉన్నది లేనిది పరిశీలించి చెప్పాలని డిస్పీని ఎస్పీ మహేశ్వర రెడ్డి ఆదేశించారు.




ఈ సమావేశంలో ఆర్డీఓ కె. సాయి ప్రత్యూష, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ కె. అనిత, నీట్ పరీక్ష సిటీ కో ఆర్డినేటర్ షోయబ్ ఆలం, ఆర్టీసీ డిఎం హెచ్. అమరసింహుడు, అసిస్టెంట్ కమిషనర్ (ఎగ్జామ్) జి. చంద్రభూషణరావు, సంబంధిత మండల తహసిల్దార్లు గణపతిరావు, చక్రవర్తి, కిరణ్ కుమార్, శ్రీనివాసరావు, బి.గోపాల్, పరీక్షా కేంద్రాల చీఫ్ సూపరింటెండెంట్లు, తదితరులు పాల్గొన్నారు.

### విద్యార్థులకు ఉచిత బస్సు ప్రయాణం

నీట్ పరీక్షకు హాజరయ్యే విద్యార్థులకు ఆర్టీసి బస్సులో ఉచిత ప్రయాణం అందిస్తుందని జిల్లా ప్రజా రవాణ అధికారి సిహెచ్. అప్పలనారాయణ బుధవారం తెలిపారు. ఆర్టీసీ మేనేజింగ్ డైరెక్టర్ ఉత్తర్వులు మేరకు ఈ నెల 21 న నిర్వహించే నీట్ పరీక్షకు హాజరయ్యే విద్యార్థుల కోసం ఏ.పీ.యస్ ఆర్టీసీ ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు వివరించారు. హాల్ టికెట్ (అడ్మిట్ కార్డు)లు చూపించిన విద్యార్థులకు ఎక్స్‌ప్రెస్, అల్ట్రా పల్లెవెలుగు, పల్లెవెలుగు, మెట్రో ఎక్స్‌ప్రెస్ సిటీ ఆర్డినరీ బస్సుల్లో విద్యార్థుల యొక్క స్వస్థలం నుండి పరీక్ష కేంద్రం వరకు ఉచితంగా ప్రయాణ సౌకర్యం కల్పిస్తున్నట్లు ఆయన వివరించారు. విద్యార్థులు సమయానికి పరీక్షా కేంద్రానికి చేరుకునేందుకు జిల్లాలోని ప్రతి డిపో నుండి ప్రత్యేక బస్సులు నడుపనున్నట్లు వెల్లడించారు. శ్రీకాకుళం కాంప్లెక్స్ నందు ప్రత్యేక హెల్ప్ డెస్క్ విద్యార్థుల సమాచారం నిమిత్తం ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు.

## కాలువల నిర్మాణంలో నాణ్యత డొల్ల



**సరుబుజ్జిలి, జూన్ 17 (వార్త):** సరుబుజ్జిలి మండలం కేంద్రంలో 12 కోట్లు విలువ చేసే రోడ్లు కాలువల నిర్మాణంలో నాణ్యతాలోపం కొట్టొచ్చినట్టు కనిపిస్తోంది. కాంట్రాక్టర్ సంబంధిత పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించలేదన్న విమర్శలు ఉన్నాయి. ఈ పనులకు సగం నిధులు కూడా ఖర్చువ్వలేదని ఈ పనులను పరిశీలిస్తే ఎవరికైనా ఇట్టే తెలిసిపోతోంది. ఈ పనులను పర్యవేక్షించాల్సిన పంచాయతీరాజ్ అధికారులు కళ్లుమూసుకున్నారా లేకుంటే వారికి ఆమ్యామ్యాలు అందాయా అన్న గుసగుసలు వినిపిస్తున్నాయి. కనీసం ఆరు నెలలు గడవకముందే కాలువలు దెబ్బతినడాన్ని చూస్తుంటే పంచాయతీరాజ్ శాఖ అలసత్వం, కాంట్రాక్టర్ నిర్లక్ష్యం ఇట్టే తెలిసిపోతుంది.

## సిక్కోలు రాజకీయాల్లో..

✳ ఒకప్పుడు శాసించిన స్థానం.. నేడు ఆత్మగౌరవ పోరాటం! ✳ అణచివేతపై తిరుగుబాటు సిద్ధమవుతున్న కాపునేతలు ✳ 'జెండాలు' పక్కన పెట్టి.. 'జాతి' కోసం ఒకే తాటిపైకి! ✳ 'తామంతా కాపులం' అనే ఒకే నినాదంతో ముందుకు

# తూర్పుకాపు గళం

**శ్రీకాకుళం, జూన్ 17 (వార్త):**
శ్రీకాకుళం జిల్లా అనగానే వెనుకబాటుతనం, వలసలు మాత్రమే గుర్తుకొస్తాయి. కానీ, అదే వెనుకబడిన జిల్లా పాలిటిక్స్‌లో కులాల సమీకరణాలు, ఆధిపత్య పోరు ఎప్పుడూ అత్యంత ఆసక్తికరంగానే సాగుతాయి. జిల్లాలో ప్రధానంగా తూర్పు కాపు, కళింగ, వెలమ సామాజిక వర్గాల మధ్యే దశాబ్దాలుగా రాజకీయ అధికారం చేతులు మారుతూ వస్తోంది. వీరిలో జనాభా పరంగానూ, సామాజిక ప్రభావం పరంగానూ 'తూర్పు కాపులది' అగ్రస్థానం. ఒకప్పుడు ఉమ్మడి శ్రీకాకుళం, విజయనగరం జిల్లాల రాజకీయాలను ఈ సామాజిక వర్గ నేతలు శాసించారు. ఉత్తరాంధ్ర వ్యాప్తంగా ఈ కులానికి చెందిన బలమైన నాయకులు ఎదిగారు. రాష్ట్ర క్యాబినెట్‌లో కీలకమైన పోర్ట్‌ఫోలియోలు నిర్వహించడమే కాకుండా, పీసీసీ అధ్యక్షుడిగా రాష్ట్ర రాజకీయ చక్రం తిప్పిన బొత్స సత్యనారాయణ వంటి నేతలు ఈ నేల నుంచే వచ్చారు. స్థానికంగా గొర్లె శ్రీరాములు నాయుడు వంటి మహానాయకులు సాధించిన గౌరవం నేటికీ ఈ సామాజిక వర్గానికి ఆదర్శంగా నిలుస్తోంది. అయితే, గత కొన్నేళ్లుగా శ్రీకాకుళం జిల్లా రాజకీయాల్లో తూర్పు కాపు సామాజిక వర్గం హవా క్రమంగా తగ్గుతూ వస్తోందనే ఆందోళన వ్యక్తమవుతోంది. పాలకొండ, ఎచ్చెర్ల, రాజాం వంటి నియోజకవర్గాల్లో తూర్పు కాపుల ఓటర్ల సంఖ్య అత్యధికంగా ఉన్నప్పటికీ.. అక్కడ రిజర్వేషన్ల కారణంగానో, లేదా ఇతర రాజకీయ సమీకరణాల వల్లో ఓసీ, ఎస్సీ, ఎస్టీ సామాజిక వర్గాలకే ప్రధాన పార్టీలు ప్రాధాన్యత ఇస్తున్నాయి. రాజాం, పాలకొండ వేర్వేరు జిల్లాలకు వెళ్లిపోవడం వీరి ఐక్యతను మరింత




ప్రశ్నించింది. ఒకప్పుడు జిల్లాను నడిపించిన స్థాయిలో నేడు ఆశించిన స్థాయిలో చెప్పుకోదగ్గ గట్టి నాయకత్వం కరువైందనే ఆవేదన క్షేత్రస్థాయిలో కనిపిస్తోంది.

### అణచివేతపై తిరుగుబాటు..
### సీఎం పీఠంపై సంచలన చర్చలు

ఇటీవల శ్రీకాకుళంలో జరిగిన 'తూర్పు కాపు ఆత్మగౌరవ సమ్మేళనం' ఈ ఆవేదనకు ఒక వేదికగా నిలిచింది. ఈ సభలో నేతలు చేసిన వ్యాఖ్యలు రాజకీయ వర్గాల్లో పెను సంచలనం సృష్టించాయి. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ కాలంలో బొత్స సత్యనారాయణకు మూడుసార్లు ముఖ్యమంత్రి అయ్యే అవకాశాలు వచ్చినప్పటికీ, ఆయన కాపు సామాజిక వర్గంలో పుట్టడం వల్లే కొందరు కుట్రపూరితంగా ఆయనను అణగదొక్కారనే చర్చ మళ్లీ తెరపైకి వచ్చింది. "ఒక్కసారి కాపు నేత గనుక సీఎం పీఠం ఎక్కితే శాశ్వతంగా ఆ కులమే అధికారంలో ఉండిపోతుందనే భయంతోనే పెద్దలని తొక్కేశారు" అని ఆనెపు రామకృష్ణానాయుడు లాంటి నేతలు బహిరంగంగానే విమర్శలు గుప్పించారు.

### 'జెండాలు' పక్కన పెట్టి..
### 'జాతి' కోసం ఒకే తాటిపైకి!

ప్రస్తుత రాజకీయాల్లో అత్యంత అరుదైన దృశ్యం ఈ సామాజిక వర్గంలో కనిపిస్తోంది. సాధారణంగా ఎన్నికల వేళ పార్టీల జెండాలు పట్టుకుని కొట్టుకునే నేతలు.. ఇప్పుడు తమ సామాజిక వర్గం కోసం ఒకే వేదిక పంచుకుంటున్నారు. వైఎస్సార్‌సీపీ నుంచి బొత్స సత్యనారాయణ, తెలుగుదేశం పార్టీ నుంచి ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావు, ఆనెపు రామకృష్ణ, బీజేపీ నుంచి సిరిపురం తేజేశ్వరరావు.. ఇలా పార్టీల అజెండాలను గడప అవతలే వదిలేసి, 'తామంతా కాపులం' అనే ఒకే నినాదంతో ముందుకు సాగుతున్నారు. 35 రోజుల్లోనే తన గెలుపు కోసం శ్రమించి శాసనమండలికి పంపిన జాతి గొప్పతనాన్ని ఎమ్మెల్సీ చిరంజీవిరావు కొనియాడారు.

### విద్యావంతులైతేనే
### ఆర్థిక పరిపుష్టి..

వెనుకబడిన వర్గాల జాబితాలో ఉన్న తూర్పు కాపులకు కేవలం రాజకీయాలే కాకుండా విద్యా, ఉపాధి రంగాల్లోనూ తగిన గుర్తింపు రావాల్సి ఉంది. చదువుతోనే ఆర్థిక పరిపుష్టి సాధ్యమని, యువత నైపుణ్యాభివృద్ధి సాధించి స్వయం ఉపాధి వైపు అడుగులు వేయాలని సామాజిక పెద్దలు పిలుపునిస్తున్నారు. అలాగే, జిల్లా కేంద్రమైన శ్రీకాకుళంలో ఇతర కులాలకు పెద్ద పెద్ద భవనాలు కేటాయించి, తూర్పు కాపులకు మాత్రం బీసీ వెల్ఫేర్ భవనాన్ని చూపించడంపై తీవ్ర నిరసన వ్యక్తమవుతోంది. జిల్లాకు వచ్చే స్వకులీయులందరికీ ఆసరాగా నిలిచే ఒక సొంత సామాజిక ఆత్మగౌరవ భవనం నిర్మించుకోవాలనే గట్టి పట్టుదలతో ఉన్నారు.

### ఇకపై మౌనం వీడి.. గళం విప్పాల్సిందే!

"ఇన్నాళ్లూ మౌనంగా ఉన్నాం.. ఇకపై మన శబ్దం గట్టిగా వినిపించాలి" అనేది తూర్పు కాపుల ప్రస్తుత నినాదం. రాబోయే రోజుల్లో జరగబోయే నియోజకవర్గాల పునర్విభజనలో తమకు న్యాయం జరగాలని డిమాండ్ చేస్తున్నారు. జనాభా ప్రాతిపదికన రావలసిన సీట్లను వేరే వర్గాలకు కేటాయిస్తే.. పార్టీల జెండాలను పక్కన పెట్టి మరీ సదరు అభ్యర్థులను ఓడించేందుకు కూడా వెనుకాడబోమని హెచ్చరిస్తున్నారు. శ్రీకాకుళం మట్టిలో పుట్టిన ఈ 'తూర్పు కాపు' సింహాలు.. తమ ఆత్మగౌరవాన్ని కాపాడుకుంటూ, ఐక్యతతో ఒకే సంఘంగా ఏర్పడితే, రాబోయే రోజుల్లో సిక్కోలు పాలిటిక్స్ సరికొత్త మలుపు తిరగడం ఖాయంగా కనిపిస్తోంది.



## ఆరోగ్యకర జీవనశైలికి..
# యోగాసనాలు రాజమార్గం





✳ మానసిక ఒత్తిడికి యోగా ఒక దివ్య ఔషధం ✳ జిల్లా పరిషత్ సిఈఓ వెంకటరామన్

శ్రీకాకుళం,జూన్17(వార్త): ఆరోగ్యకరమైన జీవనానికి యోగాసనాలే రాజమార్గమని, మానసిక ఒత్తిడికి, యోగా ఒక దివ్య ఔషధమని జిల్లా పరిషత్ సిఈఓ వెంకటరామన్ తెలిపారు. బుధవారం జిల్లా పరిషత్ అధికారులు, సిబ్బంది కార్గిల్ పార్కులో ఆయుష్ శాఖ సమన్వయంతో యోగా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో మనం ఎదుర్కొంటున్న మానసిక ఒత్తిళ్లకు, ఆందోళనలకు, వివిధ రకాల ఆరోగ్య సమస్యలకు యోగా ఒక అద్భుతమైన దివ్య ఔషధంగా ఉపయోగపడుతుందని కొనియాడారు. యోగా సాధన అనేది కేవలం శారీరక వ్యాయామం మాత్రమే కాదని, యోగాభ్యాసం ద్వారా మనస్సు, శ్వాస, శరీరాన్ని ఒకే తాటిపైకి తీసుకురావచ్చని చెప్పారు. ప్రస్తుతం నేర్పిస్తున్న యోగా ప్రక్రియలు చాలా సరళమైనవని, వీటిని ప్రతి ఒక్కరూ క్రమం తప్పకుండా తమ ఇళ్లల్లోనే సాధన చేయవచ్చని తెలిపారు. ప్రతిరోజూ యోగా చేయడం వల్ల శారీరక ఆరోగ్యంతో పాటు అద్భుతమైన వ్యక్తిత్వ వికాసం వస్తుందన్నారు. ?గత కొంతకాలంగా ఈ యోగా కార్యక్రమాలను ఎంతో అద్భుతంగా, విజయవంతంగా నడిపిస్తున్న ఆయుష్ శాఖ అధికారులకు, జిల్లా ఆయుష్ అధికారి డాక్టర్ ఉత్తమ్






రాజ్ రాణా, యోగా గురువులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. జిల్లా ఆయుష్ అధికారి డాక్టర్ ఉత్తమ్ రాజ్ రాణా మాట్లాడుతూ ప్రస్తుత కాలంలో మారుతున్న జీవనశైలి, ఒత్తిళ్లతో కూడిన ఉద్యోగాలు, మానసిక ఆందోళనల నుంచి ఉపశమనం పొందేందుకు 'యోగా' ఒక అద్భుతమైన మార్గమని కొనియాడారు. ప్రతి ఒక్కరూ తమ దైనందిన జీవితంలో యోగాసనాలను భాగం చేసుకోవడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యాన్ని సాధించవచ్చని పిలుపునిచ్చారు.? యోగా అనేది కేవలం శారీరక వ్యాయామం మాత్రమే కాదని, అది శరీరం, మనస్సు, ఆత్మను అనుసంధానించే ఒక జీవన విధానమన్నారు. యోగాతో మానసిక ప్రశాంతత లభిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో యోగా గురువు పాండ్రంకి మురళీకృష్ణ, కొంక్యాన మురళి, తదితరులు ఉండగా జిల్లా పరిషత్ అధికారులు, సిబ్బంది, ఆయుష్ శాఖ అధికారులు, సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.


Printed and published and Owner by Chowdari Pramod Kumar , printed at Chowdari Printers, Near RTC complex, Arts colleage wall beside, Hodco colony,srikakulam-532001, AP.
Published at Near RTC complex, Arts colleage wall beside, Hodco colony, Srikakulam-532001. Editor: Chowdari Pramod Kumar, E-mail:jatheeyavaartha@gmail.com.cell. 9963063761, 9160000247, RNI/APTEL:2023/87546